


## విద్యార్థులు చదువుకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 19: విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమైందని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రూ.మూడు కోట్ల 25లక్షల నిధులను మంజూరు చేయించి అదనపు తరగతి గదులు, వాష్ రూమ్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, నాయకులు ప్రశాంత్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జంగం నీలకంఠం అప్ప, తిరుపతి, సామెల్, మంచిర్యాల విద్యాసాగర్, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

***ప్యాడీ క్లీనింగ్ మిషన్లను కొనుగోలు చేస్తాం..***

రానున్న రోజుల్లో ప్యాడీ క్లీనింగ్ మిషన్లను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని శివ్వానగర్ గేట్ వద్ద ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ అల్లం మహేందర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజితారెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు తదితరులు ఉన్నారు.

## కబ్జాకు గురైన ఫారెస్ట్ భూములను స్వాధీనం చేసుకుంటాం



గౌరారం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

గాంధారి, అక్టోబర్ 19: మండలంలోని గౌరారం గ్రామంలో సర్వే చేపట్టి ఆక్రమణలకు గురైన ఫారెస్టు భూములను స్వాధీనం చేసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. గౌరారం గ్రామాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో ఆక్రమణకు గురైన ఫారెస్టు భూములను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫారెస్టు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే నిర్వహించి, వారంలోపు ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. ఫారెస్టు భూమికి హద్దులను ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో విషయాన్ని సీఎంతోపాటు కేంద్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫారెస్టు భూములను కాపాడాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో గాంధారి, బాన్సువాడ ఎఫ్‌ఆర్వోలు హిమచందన, హబీబ్, గ్రామస్తులు వంజరి శంకర్, తూము అంజయ్య, గాజుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మద్నూర్, అక్టోబర్ 19: రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను విక్రయించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనంతరం తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు సలాబత్‌పూర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును తనిఖీచేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణలోకి రాకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట సివిల్ సప్లై అధికారులు నరసింహారావు, రాజేందర్, తహసీల్దార్ ముజిబ్, వ్యవసాయాధికారి రాజు తదితరులు ఉన్నారు.



















